# కర్ణాటక- బ్యాడగి మిర్చి యార్డు కార్యాలయ దగ్ధం ఘటన

# రైతులపై అక్రమ కేసుల రద్దుకై వాస్తవ సేకరణ కమిటీ

**కర్ణాటక** రాష్ట్రంలో 1956లో ప్రారంభమైన బ్యాడగీ ఎండు మిర్చి వ్యాపార కేంద్రం, ఆసియా ఖండంలోనే అతిపెద్ద ప్రభుత్వ వ్యాపార కేంద్రాలలో ఒకటి.

అలాంటి బ్యాడగి వ్యాపార కేంద్రంలో ఊహించని విధంగా, ఏనాడు జరగని విధంగా మార్కెట్ కమిటీ కార్యాలయం పై 11-3-2024న దాడి జరిగింది. ఈ దాడిలో కార్యాలయంలోని రికార్డులు కాలిపోయాయి. కార్యాలయ సామాగ్రి ధ్వంసం అయింది. సిబ్బంది వాహనాలు తగలబడిపోయాయి. మంటలు ఆర్పివేయడానికి వచ్చిన అగ్నిమాపక వాహనం కూడా తగలబడింది. ఈ దాడిలో కోట్లాది రూపాయల నష్టం జరిగింది. మోటారు సైకిళ్ళు, చెత్త ఊడ్చే వాహనం కూడా దగ్ధమయ్యాయి. చాలామంది రైతులని ఈ నేపథ్యంలో అరెస్టు చేశారు.

**ఈ ఘటనపై వెంటనే స్పందించిన ఏఐకేఎంకేఎస్ అనుబంధ కర్ణాటక రాజ్య రైతు సంఘం (కె.ఆర్.ఆర్.ఎస్) వాస్తవ సేకరణ కమిటీని నియమించింది.** కె.ఆర్.ఆర్.ఎస్ కర్ణాటక రాజ్యాధ్యక్షులు ఆర్.మాధవరెడ్డి నేతృత్వంలో ఈ కమిటీ 2024 మార్చి 15వ తేదీన బ్యాడగి పట్టడానికి వెళ్లి పరిశీలించింది.

ఈ వాస్తవ సేకరణ కమిటీలో ఆర్.మాధవరెడ్డి, న్యాయవాదులు చాగనూరు మల్లికార్జున రెడ్డి, వీరేంద్ర పాటిల్, బళ్లారి జిల్లా కురుగోడు తాలూకా రైతుసంఘ కార్యదర్శి సురేంద్ర, హసిరుసేన నాయకులు ఓంకార గౌడ, శ్రీనివాసులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీకి దావణ గేరె రైతు నాయకులు రవి స్వామి, ఎం ఎన్ నాయక్‌లు సహాయకులుగా పనిచేశారు.

ఈ కమిటీ అల్లర్లు జరిగిన స్థలాన్ని, మార్కెట్ యార్డును క్షుణ్ణంగా పరిశీలించి వివిధ సెక్షన్లకు సంబంధించిన వారందరినీ కలిసి చర్చించింది. అనంతరం కమిటీ తన పరిశీలన, అభిప్రాయాలను తెలియపరిచింది.

ధరలు తగ్గించినందుకు రైతులు సహజంగా తమ న్యాయమైన ఆగ్రహాన్ని వ్యాపారస్తులపై ప్రదర్శిస్తారు. కానీ ఇక్కడ ఒక్క వ్యాపారి కూడా దాడికి గురికాలేదు. ఏ ఒక్క అంగడి కానీ, కొనుగోలు చేసిన సరుకు కానీ తగలబడలేదు.

దాదాపుగా 1000 మంది పైన కేసులు నమోదు చేసిన బ్యాడగి పోలీసులు, స్థానికులను ఎవరినీ అరెస్టు చేయలేదు. సిసి కెమెరాలు వీడియోలు, చూసి కాకుండా దొరికిన వాళ్ళను దొరికినట్లు అరెస్టులు చేశారు. అరెస్టు కాబడిన వారు మెజారిటీ అమాయక రైతులే. రైతుల ముసుగులో మిరప వ్యాపారుల దళారీ మాఫియా పకడ్బందీగా రైతుల కోపాన్ని మార్కెట్ యార్డు కార్యాలయం పైకి మళ్లించిన దాని ఫలితమే ఈ అల్లర్లు. నిజంగా రైతులు అల్లర్లకు పూనుకొని ఉంటే,ఎక్కడికక్కడ దాడికి దిగే వారు. ఎన్నుకోబడ్డ వాటిపైనే దాడి చేసేవారు కాదు. కేవలం మార్కెట్ యార్డు కార్యాలయ పాలకవర్గం పైనే వ్యూహాత్మకంగా జరిగిన దాడి ఇది. ముందుగానే సిద్ధం చేసుకున్న పెట్రోల్, డీజిల్ వాడి ఏపీఎంసీ పాలక భవనాన్ని మిర్చి మాఫియా తగలబెట్టింది. తెలివిగా మాఫియా అక్కడి నుంచి తప్పించుకొని అమాయకుల రైతుల అరెస్టుకు కారణమైంది. దాడికి కారకులెవరో తెలిసినా కూడా అధికారులు కానీ, వ్యాపారస్తులు కానీ స్థానికులు కానీ నోరు విప్పడం లేదు.

ఈ పరిశీలనల తర్వాత వాస్తవ సేకరణ కమిటీ ఈ విధంగా డిమాండ్ చేసింది

- బ్యాడగీలో మూడు రాష్ట్రాల అమాయక రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలి. అసలు నేరస్థులను గుర్తించేలా న్యాయ విచారణకు ఆదేశించాలి.
- అన్ని మార్కెట్ యార్డులలోనూ, ప్రైవేట్ మార్కెట్లలోనూ రైతులను మోసం చేస్తున్న ప్రైవేటు మాఫియాలను అరికట్టాలి. రైతుల కష్టార్జితాన్ని రైతులకు దక్కేలా చర్యలు చేపట్టాలి.
- ప్రతి పంచాయతీ, కనీసం ప్రతి మండలానికి కొన్ని కోల్డు స్టోరేజీ గోడౌన్ల నిర్మాణం చేపట్టి, రైతులు పండించిన పంటలకు ధర ఉన్నప్పుడే అమ్ముకునే ఉచిత అవకాశాలు కల్పించాలి.
- కర్ణాటక అసెంబ్లీలో ప్రత్యేకంగా తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను అసెంబ్లీలోనే బిల్లు పెట్టి రద్దు చేయాలి.
- మార్కెట్ యార్డు కమిటీలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.
- ఈ-మార్కెట్‌పై నిరంతర నిఘా ఉంచాలి. రైతులకు సరైన అవగాహన కల్పించాలి.
- వేలాది మంది రైతులు ఒకే రకం పంటల వైపు పరుగులు తీయకుండా ప్రభుత్వమే శాస్త్రీయ పంటల విధానం రూపొందించాలి.
- గిట్టుబాటు ధర, ఆహార భద్రత కల్పించే జవాబుదారీతనం నుంచి ప్రభుత్వాలు తప్పుకోరాదు. వ్యవసాయ ఉత్పత్తులపై జిఎస్టి విధించరాదు.
- వ్యవసాయంలోకి కార్పొరేట్ కంపెనీల ధన దాహపు చొరబాటును అరికట్టాలి.
- కనీసంగానైనా డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను పెరిగిన ఖర్చులు జీఎస్టీల నేపథ్యంలో పునర్ నిర్వచించి అమలు చేయాలి.

ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, రైతుల కళ్ళల్లో కన్నీళ్లే వస్తున్నాయి. లక్షల రూపాయలు సాగు ఖర్చులు పెట్టి, అప్పులు చేసి పండించిన పంటలపై, ఒక క్వింటాలుకి పదివేల రూపాయల ధర కోల్పోతే, 10 క్వింటాళ్లు అమ్మిన రైతుకే లక్ష రూపాయల చొప్పున మోసం జరిగితే, కోట్లాదిమంది రైతుల నుంచి ప్రతి సంవత్సరం అన్ని పంటలలో ఎంత దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఈ ప్రభుత్వాలు బ్యాంకు ఖాతాల్లో ఎన్నికల ముందు ఎంగిలి మెతుకుల బిచ్చాన్ని విదిలిస్తున్నాయి. ప్రొఫెసర్ నంజుండ స్వామి గారు చెప్పినట్టు రైతులు ఎప్పటికీ, ఎవరికీ బాకీదారులు కాదు... సర్కారే అసలు బాకీదారు'. వాళ్లకు చెందాల్సిన గిట్టుబాటుధరల సొమ్ము ఇన్నేళ్లుగా ఎన్ని లక్షల కోట్లు ఎవరెవరి ఆస్తులుగా మారేందుకు ప్రభుత్వాలు సహకరిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. కనుక అసలు తప్పు ప్రభుత్వ విధానాల్లోనే ఉంది మూలకారణాలను మార్చుకోకుండా ఇలాంటి ఘటనలను పూర్తిగా నివారించలేమని బ్యాడగి వాస్తవసేకరణ కమిటీ అభిప్రాయపడింది.

*****